క్లుప్తంగా

‘సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి’



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలన్నీ సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీవో పి.పద్మజ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న పలు సర్వేలపై సమీక్షించారు. ఇంటింటి సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, సిటిజన్ మిస్సింగ్ సర్వేలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. సర్వేల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డుల నిర్వాహణ పక్కాగా ఉండాలని, గ్రీవెన్స్‌లపై క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శివప్రసాద్ నారాయణరావు, ఈవోపీఆర్డీ బి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విస్తంలో ముగిసిన సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్



మాట్లాడుతున్న డాక్టర్ దినకర్‌రెడ్డి

పెందుర్తి: పినగాడిలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఐసీటీ స్టేట్ హెడ్ డాక్టర్ దినకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డింగ్టన్ కంపెనీ, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా విస్తం కళాశాలలో 140 గంటలపాటు నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. అంతర్జాతీయ కంపెనీ రిడ్డింగ్టన్ 1993లో స్థాపించగా.. 40 దేశాలలో విస్తరించిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ క్రమంలో సైబర్ సెక్యూరిటీకి అధిక ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.శివకుమార్ మాట్లాడుతూ మొత్తం 60 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. శిక్షణ వలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులకు శిక్షణ ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ట్రైనర్ ఉపేంద్ర, ఆర్ఎం సురేష్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ప్రశాంత్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల విజయవంతానికి బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

పెందుర్తి: ఈ నెల 28, 29 తేదీల్లో సుజాతనగర్ లో తలపెట్టిన సీపీఎం విశాఖ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వేపగుంట నుంచి పెందుర్తి కూడలి వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ 28న పెందుర్తి జూనియర్ కళాశాల నుంచి సభాస్థలి వరకు మహా ప్రదర్శన ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేఖ పాలన గురించి, ప్రజల తరుపున చేయనున్న పోరాటాల గురించి లోతుగా చర్చలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకట్రావు, జోన్ ప్రతినిధులు ప్రభుదేవా, రాజు, శ్రీనివాసరావు, జక్కాన సత్యనారాయణ, కె.అప్పలనాయుడు, అన్నపూర్ణ, లక్ష్మి, ముత్యాలమ్మ, అప్పలనర్సమ్మ, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. అదెక్కడ?



ప్లాస్టిక్ వినియోగం ప్రజలకు చాలా సౌకర్యవంతంగా మారింది. తక్కువ ఖర్చు, తేలికగా ఉండి సులభ వినియోగానికి ఆధారమైంది. దీంతో అత్యంత వేగంగా ప్రజల జీవితంలో ఓ భాగంగా మారిపోయింది. పర్యావరణ పరంగా అంతే తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగిస్తుండటంతో ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వాలు చర్యలకు దిగాయి. అయితే క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లిప్తత, ప్లాస్టిక్ ఉత్పత్తిదారులతో లాలూచీ కారణంగా నిషేధ ఉత్తర్వులు అమలుకు నోచుకోవట్లేదు. పెందుర్తి పరిధిలో ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా జరుగుతోంది.

- పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని ప్లాస్టిక్ నిషేధ చర్యలు
- కిరాణా, చేపలు, మాంసం దుకాణాల్లో యథేచ్ఛగా వినియోగం
- అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే



రైతుబజార్‌లో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కలిగిస్తున్న అధికారులు



చేపల్ని తీసుకెళ్లేందుకు పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్న విక్రేతలు

పెందుర్తి: ప్లాస్టిక్.. మన నిత్య జీవన విధానంలో పూర్తి భాగస్వామిగా మారింది. బకెట్లు, డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు ఇలా ఎక్కడ చూసినా అనుక్షణం కనిపిస్తూనే ఉంటాయి. ప్లాస్టిక్ వినియోగం ద్వారా తలెత్తే భయంకర పరిణామాలతో ప్రభుత్వాల్లో చలనం వచ్చింది. ముఖ్యంగా పలుచగా ఉండే సింగిల్ యూజ్ ప్లాస్టిక్(ఎస్‌యూపీ) కవర్ల వాడకం భవిష్యత్‌లో పర్యావరణానికి పెను ప్రమాదంగా మారనుండటంతో కేంద్ర ప్రభుత్వం ఎస్‌యూపీ నిషేధంపై కఠిన నిర్ణయం తీసుకుంది.

120 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్‌పై నిషేధం

ఇప్పటివరకు ఉన్న ప్లాస్టిక్ కవర్లను వినియోగించేసి ఇకపై వాటిని ఉత్పత్తి చేయకూడదని ప్రభుత్వ ఆదేశాలు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమల్లోకి రానుంది. దానికి ఓ నెల ముందుగానే జీవీఎంసీ/విశాఖ జిల్లా పరిధిలో ప్లాస్టిక్ నిషేధంపై జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లు ప్రత్యేక హెచ్చరికలు జారీ చేశారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం నిషేధం దిశగా అడుగులు పూర్తిస్థాయిలో పడుతున్నట్లు కనిపించట్లేదు. ముఖ్యంగా కిరాణా, మాంసాహార దుకాణాలతో పాటు టీ దుకాణాలు, చిన్నచిన్న హోటళ్లలో ఇంకా పూర్తిస్థాయిలో ఎస్‌యూపీ కవర్లను వినియోగిస్తున్నారు. 120 మైక్రాన్లు ఆపైన ఉన్న కవర్లను మాత్రమే వినియోగించాలని నిబంధనలు. ఇప్పటికీ 120 మైక్రాన్ల లోపు ఉన్న కవర్లనే వాడుతున్నారు. దీంతో పూర్తిస్థాయి ప్లాస్టిక్ నిషేధం జరుగుతుందా అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

కొరవడిన అవగాహన

జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో వ్యాపారులకు, ప్రజలకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది. జరిమానా విషయంలో ఇంకా సడలింపు ఉన్నా.. పూర్తిస్థాయిలో నిషేధం గడువు సమీపిస్తున్న వేళ అందుకు తగ్గ ప్లాట్‌ఫాంను అధికారులు సిద్ధం చేయలేదన్న ఆక్షేపణలున్నాయి. ఏదో మొక్కుబడిగా ఒకటి రెండు సమావేశాలు మాత్రమే నిర్వహించి చేతుల దులిపేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్పత్తిదారులతోపాటు, ఎక్కువగా ఈ తరహా ప్లాస్టిక్‌ను వినియోగించే దుకాణాలపై తనిఖీలు నిర్వహించడంలో అధికారుల నిర్లిప్తతే నిషేధానికి తూట్లు పొడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి.



చేపల దుకాణం వద్ద పాలిథిన్ కవర్లు

ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధ చర్యలు

- యూరోపియన్ యూనియన్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్ డైరెక్టివ్–2019 మేరకు ఎస్‌యూపీ ప్లేట్లు, గ్లాస్‌లు, స్ట్రాస్, బెలూన్ స్టిక్స్, కాటన్ బడ్స్ తదితరాలపై నిషేధం విధించింది.
- 2023 అక్టోబర్ నుంచి యూకే ప్రభుత్వం ఇంగ్లండ్‌లో ఎస్‌యూపీ నిషేధం అమల్లోకి వచ్చింది.
- చైనాలో 2020 నుంచి 2025 వరకు ప్లాస్టిక్ **నిషేధంపై దశలవారీ కార్యాచరణ రూపొందించి, అమలు చేస్తున్నారు.**
- **మే 2024 నాటికి అమెరికాలోని 12 రాష్ట్రాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించాయి.**
- **భారత్‌లో కూడా 2022 జూలై 1 నుంచి ప్లాస్టిక్** నిషేధ చర్యలు అమల్లోకి వచ్చాయి. విశాఖలో కూడా గత ప్రభుత్వ హయాంలో దీనిపై కాస్త కఠినంగానే వ్యవహరించారు. అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు తరచూ నియోజకవర్గంలో తనిఖీలు నిర్వహించి, జరిమానాలు విధించేవారు.



పాలిథిన్ కవర్‌తో వినియోగదారులు



వ్యాపారులకు, అధికారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ హేమావతి

పక్కాగా అమలు చేస్తాం



హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో పాటు, ప్లాస్టిక్ ఉత్పత్తిదారులకు ప్లాస్టిక్ నిషేధం గురించి వివరిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పర్యటించి చిరువ్యాపారులకు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగిస్తున్నాం. ప్రభుత్వాదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తాం. ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– కె.హేమావతి, జోనల్ కమిషనర్, జోన్–8

అవగాహన పెంచుతున్నాం



రైతుబజార్ వరకు ప్లాస్టిక్ నిషేధంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తున్నాం. కాయగూరల కోసం వచ్చేవారికి బజారులో పాలిథిన్ కవర్ల అమ్మకాలను పూర్తిగా నిషేధించాం. వినియోగదారులు ఇంటి నుంచి సంచులు తెచ్చుకోవాలని పదేపదే సూచిస్తున్నాం. రైతులకు కూడా ప్లాస్టిక్ వాడవద్దని గట్టిగా చెబుతున్నాం. ప్రజలు కూడా అవగాహన పెంచుకుని ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి.

– కె.పద్మావతి షర్మిల, ఈవో, రైతుబజార్, పెందుర్తి

ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు

- ఏడు నెలల వ్యవధిలోనే రూ.15 వేల కోట్ల విద్యుత్ భారం
- పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈ నెల 27న ధర్నా
- నిరసన పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్



విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల వ్యవధిలోనే ప్రజలకు తెలియకుండా రెండు దఫాలు విద్యుత్ చార్జీలు పెంచిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలపై చంద్రబాబు ప్రభుత్వం రూ.15 వేల కోట్ల భారం వేసిందని మండిపడ్డారు. రాంపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఒక్క పైసా కూడా విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు ప్రకటించారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లు అమర్చినవారిని తరిమి కొట్టాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కూడా సన్నాహాలు చేయడంపై చంద్రబాబు, లోకేష్, డీసీఎం పవన్‌కల్యాణ్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని.. అతనికి పవన్‌కల్యాణ్ తోడయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజలను మోసం చేసినా వారికి అండగా వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈ నెల 27న పెందుర్తి కూడలి నుంచి ర్యాలీగా తరలివెళ్లి ఏడీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ పోరుబాట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజల తరపున విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ఏడీకి వినతిపత్రం అందిస్తామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి, బోకం రామునాయుడు, సబ్బవరపు ముత్యాల నాయుడు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, చొప్పా నాగరాజు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, మెంటి మహేష్, ఉప్పిలి గోవింద, మనాలత జోబ్‌దాస్, పెదిశెట్టి శేఖర్, కోన శ్రీనివాసరావు, గొరపల్లి శ్రీను, చందుయాదవ్, యతిరాజుల నాగేశ్వరరావు, రాపర్తి మాధవరావు, నదియా, అప్పారావు, నక్కా మహేష్, చిరికి దేముడు, తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

రాంపురంలోని పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు మనాలత జోబ్‌దాస్(చిన్ని) ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అదీప్‌రాజ్ క్రిస్మస్ కేక్ కట్ చేసి చిన్నితో పాటు నాయకులకు తినిపించారు. నియోజకవర్గంలోని క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

తాగూర్ ఫార్మా మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత



బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: ఫార్మాసిటీలోని తాగూర్ పరిశ్రమలో ఇటీవల జరిగిన విష వాయువుల లీకేజీలో మృతి చెందిన కుటుంబాలకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం నష్టపరిహారం చెక్కులను అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పరిశ్రమలో విషవాయువులు పీల్చిన ప్రమాదంలో అడ్డతీగల మండలం గొట్టువానిపాలేనికి చెందిన ఎస్.వీరరాజశేఖర్(35), ఒడిశాకు చెందిన అమిత్‌బాగ్(23) ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇరువురికీ యాజమాన్యం రూ.40 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. సదరు పరిహార చెక్కులను మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, జనసేన జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, కూటమి నేతలు సిరపరపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు, సీహెచ్ ముత్యాలు, కన్నూరు వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



రక్షకుడు ఉదయించిన వేళ..

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు
- ఆకట్టుకుంటున్న ఏసు జనన ఘట్టాలు
- క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్‌లతో సందడి



పెందుర్తిలో ముస్తాబైన సెయింట్ థెరెసా ఆర్‌సీఎం చర్చి



చినముషిడివాడలో ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి



పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో..

పెందుర్తి: ఏసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ వేడుకలు నియోజకవర్గంలో మంగళవారం రాత్రి ఘనంగా ఆరంభమయ్యాయి. ఏసు జనన ఘట్టాలతో చర్చిలు, పలు గృహాలు పండగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. క్రిస్మస్ సంబరాల కోసం క్రైస్తవ ప్రార్థనా మందిరాలు సర్వాంగ సుందరంగా మారాయి. వాడవాడలా చర్చిలు విద్యుత్ కాంతులతో కనువిందు చేస్తున్నాయి. క్రిస్మస్ ట్రీలు, స్టార్లను మందిరాలతో పాటు ఇళ్ల వద్ద కూడా ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి ఏసు జనన ఘట్టంతో మొదలైన సంబరం అసలు వేడుకలు బుధవారం రోజంతా నిర్వహించేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేశారు.

వాడవాడలా వేడుకలు

క్రిస్మస్ వేడుకల కోసం పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని చర్చిలు ముస్తాబయ్యాయి. పెందుర్తి, చినముషిడివాడ, వేపగుంట, కృష్ణరాయపురం, లక్ష్మీపురం, పురుషోత్తపురం, సుజాతనగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే చర్చిలతోపాటు, తమ ఇళ్లకు కూడా క్రైస్తవులు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆయా చర్చిల వద్ద క్రిస్మస్ ట్రీలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. శాంతాక్లాజ్‌ల సందడి మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. చిన్నారులకు క్రిస్మస్ తాతలు చాక్లెట్లు, చిన్నచిన్న కానుకలు అందిస్తూ ఆశీర్వదిస్తున్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

పరవాడ: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకునేలా ప్రజలు ముందుకు రావాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. దేశపాత్రునిపాలెంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో భూ సమస్యలపై అందిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ మాట్లాడుతూ రైతుల నుంచి అందిన అర్జీలను పరిశీలించి, 45 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వివిధ సమస్యలపై 152 అర్జీలు తహసీల్దార్‌కు అందాయి. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాంపురం సదస్సుకు 50 అర్జీలు

పెందుర్తి: రాంపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 50 అర్జీలు వచ్చాయి. రైతుల నుంచి ఎస్‌డీసీ, మండల ప్రత్యేకాధికారి సీతారామారావు ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ ఆనంద్ కుమార్, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన తప్పనిసరి

సబ్బవరం: విద్యార్థులంతా వినియోగదారుల హక్కులు, ప్రభుత్వం తీసుకొస్తున్న వినియోగదారుల చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని కళాశాలలోని డిపార్ట్‌మెంట్ అఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వినియోగదారుల హక్కులతో పాటు భారత ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందించే డిజిటల్ సేవా విభాగంపై ప్రత్యేకమైన పట్టు సాధించాలన్నారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు ఎం.గోవిందరావు మాట్లాడుతూ వినియోగదారుల చట్టం–2018 ప్రకారం వినియోగదారులకు ప్రత్యేకమైన హక్కులను, న్యాయ పరమైన విధివిధానాలను కల్పించిందన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

పరవాడ: విశాఖ స్టీల్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ధర్మారాయుడుపేట జెడ్పీ హైస్కూల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధి మంత్రి జగన్నాథరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షలు జరిపి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, కళ్లద్దాలు అందిస్తామన్నారు.

